



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 137 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 29 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 137 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 29 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## అసెంబ్లీలో "జై అమరావతి" నినాదాలు చేసిన మంత్రి నారా లోకేశ్


- అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానానికి మద్దతుగా మాట్లాడిన లోకేశ్
- రాజధానిపై జగన్ తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్
- మూడు ముక్కలాట ఆడి ప్రజలను మోసం చేశారని విమర్శ
- రాష్ట్ర ప్రజలకు, రైతులకు జగన్ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య
- ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ

- మిగతా2లో

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'జై అమరావతి' నినాదాలు మార్మోగాయి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై జరిగిన చర్చలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ప్రసంగం మధ్యలో ఈ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజధానిగా అమరావతే ఉంటుందని అబద్ధం చెప్పి ముఖ్యమంత్రి అయ్యాక జగన్ మూడు ముక్కలాట ఆడారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై సభలో చర్చ జరుగుతుంటే జగన్ బెంగళూరులో

## అమరావతి నగరం ఆంధ్రప్రదేశ్ ఆత్మ...
# ఎవరూ టచ్ చేయలేరు

- ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని అసెంబ్లీ తీర్మానం
- విభజన చట్టంలో 'ఎట్ అమరావతి' అని చేర్చాలని కేంద్రాన్ని కోరిన సభ
- రాజధానిపై జగన్‌ది ఊసరవెల్లి రాజకీయమని సీఎం చంద్రబాబు విమర్శ
- భూములిచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్న సీఎం
- 2028 నాటికి అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేసిన ప్రభుత్వం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని... అది అమరావతేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అజేయం, అద్భుతం, అజరామరమని అభివర్ణించారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని పునరుద్ఘాటించారు. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అమరావతి ఆంధ్రప్రదేశ్ ఆత్మ అని, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అని అభివర్ణించారు.

**అమరావతికి చట్టబద్ధత**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5(2)ను సవరించాలని ఈ తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరారు. చట్టంలో రాజధానిని పేర్కొనేచోట 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చేర్చాలని ప్రతిపాదించారు. సీఆర్డీఏ చట్టం ప్రకారం నోటిఫై చేసిన ప్రాంతాలన్నిటికీ రాజధాని పరిధి వర్తింపజేసేలా చట్ట సవరణ చేయాలని కోరారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌తో పాటు కేంద్ర హోంమంత్రికి పంపించారు. ఈ తీర్మానం ప్రతుల్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపడం ద్వారా అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు.

**రైతుల త్యాగం.. జగన్‌పై విమర్శలు**

రాష్ట్ర భవిష్యత్తు కోసం 34 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. రైతులు ఇచ్చింది కేవలం భూమి కాదని, రాష్ట్ర భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు. ఇదే సమయంలో, గత ప్రభుత్వంపై, ప్రతిపక్ష నేత జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

"ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తున్నానని చెప్పిన వ్యక్తి, అధికారంలోకి వచ్చాక రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని అంటారు. వీళ్లకు ఏదైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా? వీళ్లు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అనుసరిస్తారు, దేశం అనుసరించేది అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని" అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతికి రుణాలు రాకుండా ప్రపంచ బ్యాంకుకు ఈ-మెయిల్స్ పంపడం వంటి కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు.చారిత్రక నేపథ్యం.. కోల్పోయిన రాజధానులు తెలుగువారి చారిత్రక వైభవాన్ని గుర్తుచేస్తూ, కృష్ణానది తీరంలోని అమరావతిని రాజధానిగా చేసుకుని శాతవాహనులు పాలించారని చంద్రబాబు

- మిగతా2లో


## అసెంబ్లీ వేదికగా పవన్ కల్యాణ్ కు థాంక్స్ చెప్పిన చంద్రబాబు..

- అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ
- 2014లో పవన్ బేషరతుగా మద్దతివ్వడం, 2024 కూటమి ఏర్పాటును గుర్తు చేసుకున్న చంద్రబాబు
- 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి వచ్చిన తీర్పు చారిత్రకమన్న సీఎం
- మూడు రాజధానుల పేరుతో వైసీపీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శలు
- అమరావతి పనులను పునఃప్రారంభించామని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పునరుద్ధరించే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు.

- మిగతా2లో




నెల రోజుల అనంతరం, ఇరాన్‌కు

## మద్దతుగా ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణి దాడి

- ఇజ్రాయెల్‌పై దాడి చేసిన యెమెన్ హూతీ మిలిటెంట్లు
- నెల రోజుల యుద్ధం అనంతరం మొదటిసారి కదనరంలోకి హూతీలు
- క్షిపణి దాడిని అడ్డుకున్నట్లు ప్రకటించిన ఇజ్రాయెల్

- మిగతా2లో



## ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది

- శాసన మండలిలో చంద్రబాబుకు జరిగిన అవమానాలపై అచ్చెన్నాయుడు తీవ్ర భావోద్వేగం
- తుపాకీ ఉంటే కాల్చేయాలనిపించేంత దారుణంగా తిట్టారని వ్యాఖ్య
- 2019లో ప్రజలు తప్పు చేశారని, లక్ష కోట్లు దోచిన దొంగకు ఓటేశారని విమర్శ
- అమరావతికి చట్టబద్ధత కల్పించడానికే నేటి తీర్మానం అని వెల్లడి
- గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిందని ఆరోపణ

- మిగతా2లో



## జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగింది

- అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పలా మార్చారన్న పేర్ని నాని
- అమరావతికి చట్టబద్ధత తీర్మానం ఒక డ్రామా అని విమర్శ
- మండలి ఆమోదం లేకుండా చట్టబద్ధత ఎలా వస్తుందని ప్రశ్న?

**పెన్ పవర్ డెస్క్:**రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన


- మిగతా2లో



## నోయిడా వెళితే ప్రధాని పదవి పోతుందని నాతో చెప్పారు

- పదవులు కోల్పోతామనే భయంతో నాయకులు నోయిడాకు రావడం మానేశారన్న ప్రధాని
- ఎస్పీ అధికారంలో ఉన్నప్పుడు నోయిడాకు రావాలనుకుంటే నాటి సీఎం వద్దని చెప్పారన్న మోదీ
- "ఈ మధ్యనే ప్రధాని అయ్యారు, నోయిడాకు వెళ్లవద్దు" అని సూచించారని వెల్లడి
- ప్రజల ఆశీర్వాదం కోసం వెళతానని ఆ ముఖ్యమంత్రికి తాను స్పష్టం చేశానన్న మోదీ

- మిగతా2లో




## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు


- బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ దాటినట్లు వెల్లడి
- అంతర్జాతీయ జలాల్లోకి రెండు నౌకలు ప్రవేశించాయన్న భారత వర్గాలు
- 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ రాక

**పెన్ పవర్ డెస్క్:**భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శుక్రవారం నాడు దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో

- మిగతా2లో

## మీరు అలా చేయాల్సిందే

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి హెచ్చరిక



- అభివృద్ధి, శాంతి కావాలంటే తాము చెప్పినట్లు చేయాలన్న ఇరాన్ అధ్యక్షుడు
- అమెరికా, ఇజ్రాయెల్‌లు మీ గగనతలాలను వినియోగించుకోకుండా చూడాలని హెచ్చరిక
- మౌలిక సదుపాయాలు, ఆర్థిక కేంద్రాలు లక్ష్యంగా చేసుకుంటే ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరిక

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

## కోరికలు తీర్చే పవిత్ర ఏకాదశి

హిందూ సంప్రదాయంలో ఏకాదశి వ్రతాలకు అత్యంత విశిష్ట స్థానం ఉంది. ప్రతి నెలలో వచ్చే రెండు ఏకాదశుల్లో చైత్రమాసం శుక్లపక్షంలో వచ్చే కామద ఏకాదశి ప్రత్యేకమైనది. "కామద" అన్న పదానికి అర్థం ? "కోరికలు నెరవేర్చే". అందుకే ఈ ఏకాదశిని కోరికల పరిపూరణకు కారణమయ్యే పవిత్ర దినంగా భావిస్తారు. ఈ ఏకాదశికి మరొక పేరు 'దమన ఏకాదశి'. ఇది మనిషి లోపాలను ? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ? దమన చేసే శక్తిని కలిగి ఉంటుంది. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శుభాలు సిద్ధిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. వరాహ పురాణం ప్రకారం శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఈ వ్రత మహాత్మ్యాన్ని వివరించాడు. వశిష్ఠ మహర్షి దిలీప మహారాజుకు ఈ వ్రత విశిష్టతను వివరించాడని కూడా పురాణ ప్రస్తావన ఉంది. ఈ వ్రతం ద్వారా సంతాన లభ్యం, వైవాహిక జీవిత సౌఖ్యం, సౌభాగ్య స్థిరత్వం లభిస్తాయని నమ్మకం. పూర్వం రత్నపుర అనే రాజ్యంలో పుండరీకుడు అనే రాజు పాలన సాగించేవాడు. ఆయన రాజసభలో గంధర్వులు, కిన్నెరులు, కింపురుషులు, అప్సరసలు కళలతో వినోదాన్ని అందించేవారు. ఒకరోజు, లలితకాంత అనే గంధర్వుడు తన భార్య లలితను గురించిన ఆలోచనలతో తక్కువ నిబద్ధతతో కళా ప్రదర్శన ఇవ్వడం గమనించిన రాజు, కోపంతో అతనిని రాక్షసుడిగా కమ్మని శపించాడు. తన స్వరూపం కోల్పోయిన లలిత కాంతుని భార్య లలిత, భర్తను రక్షించేందుకు శృంగి మహర్షిని ఆశ్రయించింది. మహర్షి ఆమెకు కామదా ఏకాదశి వ్రతం ఆచరించమని ఉపదేశించాడు. లలిత భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించడంతో భర్తకు శాప విమోచనం లభించి పూర్వరూపాన్ని పొందాడు. వీరిద్దరూ మోక్షాన్ని పొందినట్లు పురాణం చెబుతుంది. దశమి రోజున సాయంత్రం తర్వాత తిండి తీసుకోకుండా ఉపవాసానికి సిద్ధమవ్వాలి. సాత్విక ఆహారం తీసుకోవాలి. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి శుద్ధంగా స్నానం చేయాలి. పూజా గృహంలో విష్ణు విగ్రహాన్ని అలంకరించి, దీపం, పుష్పాలు, తులసీదళాలు సమర్పించాలి. విష్ణు సహస్రనామం, అష్టోత్తర శతనామావళి పారాయణ చేయాలి. ఉపవాసంతో, జాగరణతో ఈ దినాన్ని గడపాలి. ద్వాదశి రోజున బ్రాహ్మణులకు భోజనం పెట్టి, దానధర్మాలు చేసి, ఆ తరువాతే స్వయంగా భోజనం చేయాలి. తద్వారా పూర్వకర్మల వల్ల ఏర్పడిన పాపాలు తొలగిపోతాయి. కోరికలు నెరవేరుతాయి. సంతాన యోగం కలుగుతుంది. స్త్రీలకు సౌభాగ్యం నిలుస్తుంది. వైవాహిక సమస్యలు తొలగిపోతాయి. మోక్ష మార్గం వైపు అడుగులు వేయగలుగుతారు. కామద ఏకాదశి ఒక పరమ పవిత్రమైన వ్రతం. భక్తి, శ్రద్ధ, నియమ నిష్ఠలతో ఈ వ్రతాన్ని ఆచరించే వారికి భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. దురాశలు తొలగిపోయి, ఆత్మ శుద్ధి కలుగుతుంది. శాస్త్రాలు, పురాణాలు చెప్పిన విధంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సకల శుభాలు, కోరికల పరిపూరణ జరుగుతాయి.

## హర్మ్యూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

- మొదటి పేజి తరువాయి

ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మ్యూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మ్యూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

# అమరావతి నగరం ఆంధ్రప్రదేశ్ ఆత్మ... ఎవరూ టచ్ చేయలేరు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం 'అమరావతి గ్యాలరీ' మన ఘన చరిత్రకు నిదర్శనమని చెప్పారు.

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రాభవాన్ని కోల్పోయామని, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, ఇప్పుడు విభజనతో దాన్ని కూడా కోల్పోయి అమరావతిని నిర్మించుకుంటున్నామని వివరించారు. రాజధానులు కోల్పోతూ వివక్ష, అవమానాలు భరిస్తూ వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్ల విధ్వంసం**

2019లో ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ప్రజావేదికను కూల్చివేసి విధ్వంస పాలనకు నాంది పలికిందని చంద్రబాబు ఆరోపించారు. అమరావతిని నాశనం చేసి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని మండిపడ్డారు. రాజధాని కోసం పోరాడిన రైతులపై లాఠీలతో కొట్టి, బూట్లతో తన్ని, అక్రమ కేసులు పెట్టి 'కీచకపర్వం' సాగించారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో అడ్డదారిలో ఆమోదింపజేయాలని చూసినా, న్యాయస్థానాలు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. ఈ తుగ్లక్ నిర్ణయాల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా పోయాయని విమర్శించారు.

**హైదరాబాద్ స్ఫూర్తి.. అమరావతి భవిష్యత్**

తాను విజన్-2020తో సైబరాబాద్‌ను ఇటుక ఇటుక పేర్చి నిర్మించానని, దాని ఫలితంగానే హైదరాబాద్ నగరం దేశంలోనే 'మోస్ట్ లివబుల్ సిటీ'గా నిలిచి, రూ. 1.05 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తోందని చంద్రబాబు తెలిపారు. అదే స్ఫూర్తితో అమరావతిని కూడా దేశం గర్వించేలా 'బ్లూ అండ్ గ్రీన్ సిటీ'గా, భవిష్యత్ నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాజధాని ఒకటే అయినా, అభివృద్ధిని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని, విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. 2028 నాటికి పనులన్నీ పూర్తి చేసి అమరావతికి ఒక సంపూర్ణ రూపాన్ని తీసుకువస్తామని చంద్రబాబు శాసనసభకు హామీ ఇచ్చారు.

# మీరు అలా చేయాల్సిందే

మీకు అభివృద్ధి, భద్రత, శాంతి కావాలనుకుంటే, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను మీ భూభాగాల మీద నుండి దాడులు చేయకుండా నిరోధించాలని గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. గల్ఫ్ దేశాలపై దాడులు ఆగాలన్నా, శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలని స్పష్టం చేశారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకుని శత్రువులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వవద్దని షరతు విధించారు. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలను ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరించారు. ఇరాన్ ఎప్పుడూ ముందుగా దాడులు చేయదని స్పష్టంగా చెప్పామని అన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, ఆర్థిక కేంద్రాలు, అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే ప్రతీకారం తప్పదని పలుమార్లు హెచ్చరించామని గుర్తు చేశారు. శత్రుస్థావరాలు భూస్థాపితమయ్యే వరకు దాడులు చేస్తామని స్పష్టం చేశారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదిలేది లేదన్నారు.

# నెల రోజుల అనంతరం, ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణి దాడి

పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నెల రోజుల తర్వాత, ఇరాన్‌కు మద్దతుగా ఉండే యెమెన్ హూతీ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మొదటిసారి దాడి చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం ఓ వైపు దాడులు, మరోవైపు కాల్పుల విరమణకు సంప్రదింపులు జరుగుతున్న సమయంలో ఈ కీలకపరిణామం చోటుచేసుకుంది. హూతీలు మొదటిసారి కదనరంగంలోకి దిగారు. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా వారు క్షిపణి దాడులు నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై దాడులు చేసినట్లు హూతీల ప్రతినిధి యాహ్యా సారె ధృవీకరించారు. యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణిని గుర్తించి, దాడిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ క్షిపణిని అడ్డుకున్నాయని వెల్లడించింది. హూతీల దాడితో ప్రాణ, ఆస్తి నష్టం కలిగినట్లు తెలియరాలేదు.

యుద్ధంలోకి హూతీలు రావడం చమురు మార్కెట్‌కు ఆందోళన కలిగించే అంశం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు క్రియాశీలకంగా వ్యవహరించారు. పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గంలో వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. అయితే నెల రోజులుగా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం జరుగుతున్నప్పటికీ హూతీలు కనిపించలేదు. తాజా దాడి చర్చకు దారితీసింది.

# ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది

గత ప్రభుత్వ హయాంలో సభలో చంద్రబాబుకు, తమకు జరిగిన అవమానాలు చూశాక.. తన దగ్గర తుపాకీ ఉంటే కాల్చిపడేసేవాడిని అనిపించేంత ఆవేదన, కోపం కలిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును మండలిలో అడ్డుకున్న సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేసుకుంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తిట్లు పడటానికే రాజకీయాల్లోకి వచ్చామా అని ఆ రోజు ఆవేదన చెందానని అన్నారు.

**గన్నుంటే కాల్చేయాలనిపించింది**

గత ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును శాసనమండలిలో ప్రవేశపెట్టిన రోజు జరిగిన ఘటనలను అచ్చెన్నాయుడు పూసగుచ్చినట్టు వివరించారు. "ఆ రోజు చంద్రబాబు గారిని, మమ్మల్ని అనరాని మాటలు అన్నారు. ఆ మాటలు వింటే నాలాంటోడికైతే గన్ను ఉంటే కాల్చేయాలి అనిపిస్తుంది. ఇంత దారుణమా? ఈ తిట్లు తినడానికేనా మనం రాజకీయాల్లో ఉన్నది? అనిపించింది. అయినా సరే, చంద్రబాబు గారు ఎంతో ఓపికతో నిలబడ్డారు. ఆయన ఓపికకు జోహార్లు. ఇది మన బాధ్యత అని మాకు ధైర్యం చెప్పారు" అని అచ్చెన్నాయుడు అన్నారు.

**ప్రజాస్వామ్యానికి చీకటి రోజు**

మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో ప్రవేశపెట్టిన 2020, జనవరి 21వ తేదీని ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అచ్చెన్నాయుడు అభివర్ణించారు. "శాసన మండలిలో మాకు బలం ఉన్నా, వైఎస్సార్సీపీకి కేవలం 8 మంది సభ్యులే ఉన్నా.. బిల్లును అడ్డగోలుగా పాస్ చేయాలని చూశారు. మంత్రులు, ఎమ్మెల్యేలందరూ మండలిలోకి వచ్చేశారు. లైట్లు ఆపేశారు, టీవీ ప్రసారాలు నిలిపేశారు. చైర్మన్ షరీఫ్ గారి ఛాంబర్‌ను విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు చుట్టుముట్టి తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చైర్మన్ గారు ధైర్యంగా నిలబడి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి రాష్ట్రాన్ని బతికించారు" అని ఆయన వివరించారు.

**2019లో ప్రజలు తప్పు చేశారు**

2019 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తప్పిదం చేశారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. "2014-19 మధ్య చంద్రబాబు పాలన ఈ రాష్ట్రానికి ఒక స్వర్ణయుగం. అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తూ, సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాం. అయినా ప్రజలు మమ్మల్ని ఎందుకు ఓడించారో అర్థం కాలేదు. ఎవరో కొత్తగా ఆకాశం నుంచి దిగివచ్చి పార్టీ పెడితే నమ్మి ఓటేస్తే ఫర్వాలేదు. కానీ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు దోచుకుని, 16 నెలలు జైల్లో ఉన్న ఒక దొంగకు ఓటు వేశారనేదే నా బాధ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**మూడు రాజధానుల పేరిట చిచ్చు**

గత ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. "విశాఖపట్నాన్ని రాజధాని చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఏం ఉద్ధరించారు? ఒక్క ఇటుక కూడా వేశారా? కేవలం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలతో ఆడుకున్నారు. మేము అమరావతే రాజధాని అని ఎన్నికలకు వెళ్లాం, ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. రాజధాని పేరుతో అమరావతి రైతులను, రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఒక శిల్పిలా చంద్రబాబు గారు రాజధానిని చెక్కుతుంటే.. ఒక దుర్మార్గుడు వచ్చి సర్వనాశనం చేశాడు" అని ఆయన విమర్శించారు.

**అమరావతికి చట్టబద్ధత.. ప్రజలకు విజ్ఞప్తి**

అమరావతి రాజధాని నిర్మాణానికి చంద్రబాబు గారు కారకుడు, కర్త, క్రియ అని అచ్చెన్నాయుడు అన్నారు. "భవిష్యత్తులో మళ్లీ ఎవరైనా పిచ్చోడి చేతికి రాయి దొరికినట్టు, రాజధానిని మార్చాలని ప్రయత్నించకూడదనే ఉద్దేశంతోనే ఈరోజు ఈ తీర్మానం చేస్తున్నాం. దీనికి చట్టబద్ధత కల్పించి కేంద్రానికి పంపుతున్నాం. ప్రజలారా.. మళ్లీ వైకుంఠపాళి ఆట ఆడొద్దు. ప్రలోభాలకు లొంగి మళ్లీ తప్పు చేస్తే ఈ రాష్ట్రాన్ని ఎవ్వరూ బాగుచేయలేరు. మీ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి" అని ఆయన ప్రజలకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

## జగన్ హయాంలోనే అమరావతిలో
# రోడ్ల నిర్మాణం జరిగింది

- మొదటి పేజి తరువాయి

చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు.

నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

# నోయిడా వెళితే ప్రధాని పదవి పోతుందని నాతో చెప్పారు

సమాజ్‌వాది పార్టీ నేతలు మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికి వదిలేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో నోయిడాకు రావడమే మానేశారని ఆరోపించారు. సమాజ్‌వాది పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను ఇక్కడకు రావాలని అనుకున్నానని, ఈ నిర్ణయంతో నాటి ముఖ్యమంత్రి ఆందోళనకు గురయ్యారని అన్నారు. "మోదీ గారూ, నోయిడాకు వెళ్లవద్దు, మీరు ఈ మధ్యనే ప్రధాని అయ్యారు" అని ఆయన తనను హెచ్చరించారని చెప్పారు. నోయిడాకు ఆయన రాకపోగా, తనను కూడా రావొద్దని సూచించారని తెలిపారు. తాను మాత్రం కచ్చితంగా వెళతానని ఆ ముఖ్యమంత్రికి స్పష్టంగా చెప్పానని తెలిపారు. నోయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళతానని, అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుందని భావిస్తున్నానని ఆయనతో చెప్పినట్లు వెల్లడించారు. ఒకప్పుడు రాజకీయ నాయకులు ఈ నగరాన్ని వదిలేశారని, కానీ ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నగరం ఈరోజు దేశానికి గర్వకారణంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం చాలాకాలంగా ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పై వ్యాఖ్యలు చేశారు. 1988 నుంచి ఈ నగరంలో పర్యటించిన పలువురు ముఖ్యమంత్రులు ఆ తర్వాత వివిధ కారణాలతో పదవులకు దూరమయ్యారు. దీనితో నోయిడాకు వెళ్లడానికి రాజకీయ ప్రముఖులు ఆసక్తి కనబరచరు. అయితే యోగి ఆదిత్యనాథ్ తాను ముఖ్యమంత్రి అయ్యాక పలుమార్లు నోయిడాలో పర్యటించారు.

## అసెంబ్లీలో "జై అమరావతి" నినాదాలు చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

ఉండటాన్ని లోకేశ్ తప్పుబట్టారు. ఇది వ్యక్తిగత విషయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు. ంగత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చేసిన ఆందోళనలకు సంబంధించిన ఫొటోలను లోకేశ్ సభలో ప్రదర్శించారు. ప్రజలను, రైతులను మోసం చేసినందుకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' తమ ప్రభుత్వ విధానమని లోకేశ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అమరావతి రాజధాని తీర్మానానికి తాను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

## అసెంబ్లీ వేదికగా పవన్ కల్యాణ్ కు థాంక్స్ చెప్పిన చంద్రబాబు..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ పోషించిన పాత్రను, ఆయన అందించిన మద్దతును ఎప్పటికీ మరవలేనని చంద్రబాబు భావోద్వేగంగా ప్రసంగించారు. కూటమి చారిత్రక విజయంలో పవన్ పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.

**కూటమి ఏర్పాటులో పవన్ కీలక పాత్ర**

2014 ఎన్నికల సమయాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, "ఆనాడు బీజేపీతో పొత్తు ఖరారైన తర్వాత, పవన్ కల్యాణ్ గారిని కలవడానికి నేను స్వయంగా వారి ఇంటికి వెళ్లాను. రాష్ట్ర భవిష్యత్తు, దేశ రాజకీయాల దృష్ట్యా ఎన్డీయే కూటమికి బేషరతుగా మద్దతు ఇస్తానని పవన్ ఆ రోజు చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకున్నారు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ మాకు మద్దతుగా నిలిచారు" అని వివరించారు. అలాగే, 2024 ఎన్నికలకు ముందు తాను జైల్లో ఉన్నప్పుడు, రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీలన్నీ కలిసి పోటీ చేయాలని పవన్ కల్యాణ్ తీసుకున్న చొరవను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంం

**అది చారిత్రక విజయం**

2024 ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం అసాధారణమైనదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. "నేను ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశాను. కానీ 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 175 స్థానాలకు గాను 164 సీట్లు గెలిచిన ఏకైక ఎన్నిక ఇదే. ఇది మూడు రాజధానులకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఈ విజయంతో రాష్ట్రంలో మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయి" అని చంద్రబాబు అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రానికి వైసీపీ ద్రోహం చేసింది**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైసీపీ ద్రోహం చేసింది. అమరావతిని శివసేన, బీజేపీ, చివరికి కాంగ్రెస్ కూడా అంగీకరించాయి. కానీ కేవలం రాజకీయ లబ్ధి కోసం రాజధానిని నాశనం చేసిన ఏకైక పార్టీ వైసీపీనే" అని ఆయన ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో అమరావతి రైతులు, ప్రజలు పడిన బాధ వర్ణనాతీతమని అన్నారు.

**అమరావతి పనులు మళ్లీ ప్రారంభం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పునఃప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఒక నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ రీస్టార్ట్ కావడం చరిత్రలో అమరావతిలోనే జరుగుతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ. 15,000 కోట్లు మంజూరు చేసింది. మే 2, 2025న పనులు పునఃప్రారంభించాం. నిధుల సమీకరణకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం" అని సభకు వివరించారు.

**2028 నాటికి పూర్తి.. పక్కా టైమ్‌లైన్**

అమరావతి నిర్మాణ పనుల పూర్తికి సంబంధించిన స్పష్టమైన గడువులను కూడా సీఎం చంద్రబాబు సభలో ప్రకటించారు. మంత్రి నారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆ వివరాలను వెల్లడించారు. "ట్రంక్ రోడ్లన్నీ 2027 మే 27 నాటికి పూర్తవుతాయి. అసెంబ్లీ భవనాన్ని 2028 మే 28 నాటికి, హైకోర్టును 2028 జూన్ 20 నాటికి పూర్తి చేస్తాం. ఐదు ఐకానిక్ టవర్లను 2028 ఆగస్టు 4 నాటికి పూర్తి చేసి రాజధానిని అనుకున్న సమయానికి ప్రజలకు అందిస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# వీర్లంకపల్లి శ్రీ రామాలయానికి టిటిడి నిధులు

**శ్రీవాణి ట్రస్ట్ చెక్కును అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**గోకవరం పెన్ పవర్ మార్చి 28 :**-గోకవరం మండలం వీర్లంకపల్లి గ్రామంలో ఉన్నటువంటి పురాతన శ్రీ రామాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ రూ 9,95,601/లు చెక్కును ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు శక్తి వంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. హిందూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషిని అందిస్తానని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా వీర్లంకపల్లి శ్రీ రామాలయానికి నిధులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర్లంకపల్లి వెలుగు స్కూల్ చైర్మన్ సుంకరరాజు, భావన పోసేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి


## నియోజకవర్గంలోని భూ సమస్యలు పరిష్కరించాలి-సువర్ణ రాజు




**గోపాలపురం, పెన్ పవర్ మార్చ్ 28** :నియోజకవర్గంలోని భూ సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు కొవ్వూరు, ఆర్డీవో కాకర ఆనందరావు ను కోరారు. సువర్ణరాజు శనివారం జనసేన నాయకులతో కలిసి కొవ్వూరు ఆర్టీవో ఆనందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పల్లి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో పలు భూ సమస్యలు దీర్ఘకాలికంగా పెనవేసుకుని ఉన్నాయన్నారు. పలు గ్రామాల్లో స్మశాన భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే గోపాలపురం మండలంలోని సగ్గొండ, గోపవరం, రాజంపాలెం తదితర గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. అయితే ఈ సమస్యలపై స్పందించిన ఆర్డీవో భూముల సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సువర్ణ రాజు తెలిపారు.

# 30 న జిల్లాలో శాసన సభ్యులచే గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

**- కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 28:**తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వం నిర్మించిన గృహాల గృహ ప్రవేశ కార్యక్రమాలను ఈ నెల 30వ తేదీన విస్తృతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం తెలిపారు.

జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఒకేసారి నిర్వహించనున్నాయని వెల్లడించారు. జిల్లాలో టిడ్కో హౌసింగ్ పథకాల కింద నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అందజేసే ఈ కార్యక్రమాలకు సంబంధిత నియోజకవర్గాల శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరై ప్రారంభోత్సవాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. రాజమ హేంద్రవరం రూరల్ మండలంలో టిడ్కో గృహాల గృహ ప్రవేశ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి , సిటీ ఎమ్మెల్యే శ్ల ఆదిరెడ్డి శ్రీనివాస్ నామవరం (సాటిలైట్ సిటీ) వద్ద ఉదయం 10:00 గంటలకు టిడ్కో గృహాల కార్యక్రమం లో పాల్గొననున్నారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం, బలభద్రపురం వద్ద ఉదయం 11:00 గంటలకు గృహ ప్రవేశం లోఎమ్మెల్యే శ్ నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి పాల్గొననున్నారు.

రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం, శ్రీరంగపట్నం వద్ద సాయంత్రం 4:00 గంటలకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరవుతారు. జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం, తిరుమయలంపాలెం వద్ద ఉదయం 11:00 గంటలకు కార్యక్రమం లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొననున్నారు. నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు మండలం, పందలపర్రు వద్ద మధ్యాహ్నం 12:00 గంటలకు గృహ ప్రవేశ కార్యక్రమంలో స్థానిక శాస న సభ్యులు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు మండలం, దొమ్మేరు వద్ద ఉదయం 10:00 గంటలకు కార్యక్రమం లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. గోపాలపురం నియోజకవర్గం కొమటికుంట వద్ద ఉదయం 10:00 గంటలకు గృహ ప్రవేశ లోఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొనను న్నారు. మండపేట నియోజకవర్గం మండపేట పట్టణంలోని 20వ వార్డులో మధ్యాహ్నం 2:00 గంటలకు టిడ్కో గృహాల కార్యక్రమం లో ఎమ్మెల్యే వేగుల్ల జోగేశ్వరరావు పాల్గొననున్నారు. ఈ గృహ ప్రవేశ కార్యక్రమాలు విజయవంతం కావడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన తుది వివరాలను సంబంధిత నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులకు తెలియ జేయడం జరిగిందనీ, స్థానిక ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా నోడల్ అధికారి గా హౌసింగ్ పిడి నాతి బుజ్జి క్షేత్ర స్థాయిలో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

# గంగవరంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు







**గంగవరం, పెన్ పవర్, మార్చి 28** : పోలవరం జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్

మండల కేంద్రమైన గంగవరంలో ఆకస్మికంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పీఓ స్మరణ్‌రాజ్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టిన ఆయన, ప్రభుత్వ సేవల అమలుపై ప్రత్యక్షంగా పరిశీలించారు. మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓపీ ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించారు. వార్డులను తనిఖీ చేసి వైద్య సేవల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంత మందికి వేస్తున్నారో వైద్యాధికారిని డాక్టర్ శ్వేతాను ప్రశ్నించారు. కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. వెలుగు ఆధ్వర్యంలో నడుస్తున్న వన్‌ధన్ కేంద్రంలోని జీడిపప్పు తయారీ యూనిట్‌ను పరిశీలించారు. యూనిట్‌లో రోజువారీ పనితీరు, కార్మికుల సంఖ్య, ఉత్పత్తి పరిమాణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు యంత్రాలు అందించాలని మహిళలు కలెక్టర్‌ను కోరగా, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదుపరి గంగవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల అమలు, పింఛన్ల పంపిణీపై సిబ్బందిని ప్రశ్నించారు. సచివాలయంలో అందిస్తున్న సేవల వివరాలను కార్యదర్శి శ్రీనివాస్ వివరించారు. ఎంపీడీఓ వై.లక్ష్మణరావు, తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు మండల స్థాయి అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థులతో ముచ్చటించి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో మెనూ, విద్యా ప్రగతి, వసతులపై వివరాలు అడిగి తెలుసుకుని, అవసరమైన సదుపాయాలపై నివేదిక సమర్పించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములను ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, ఎంపీడీఓ వై.లక్ష్మణరావు, ఆర్ఐ టి.లక్ష్మణరావు, ఉపాధి ఏపీఓ ప్రకాశ్, పిహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, ఎంపీపీ కృష్ణారెడ్డి ,సర్పంచ్ కలుముల అక్కమ్మ ,మాజీ జెడ్పిటిసి వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కనిగిరి రాంబాబు, టిడిపి మండల్ కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# మొల్లేరు పిఏసిఎస్ అభివృద్ధికి కృషి

**చైర్‌పర్సన్ పాము అర్జున్**

**గంగవరం, పెన్ పవర్ మార్చి 28:** మొల్లేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లిమిటెడ్ (నం. జ-400) కార్యాలయంలో సంఘ చైర్‌పర్సన్ పాము అర్జున్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సభ్యుల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సభకు పర్సన్ నరమాల శ్రీనివాసరావు, ఇంచార్జీ సీఈఓ కామిశెట్టి వీరభద్రరావు, గంగవరం మండల వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, కో-ఆప్షన్ మెంబర్ కళ్ళెం ప్రభాకరరావు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ నార్గిన సంజీవరావు, మొల్లేరు నీటి సంఘం అధ్యక్షుడు గుత్తా శ్రీరాములు, నెల్లిపూడి సర్పంచ్, మొల్లేరు మాజీ సర్పంచ్, , మాజీ సీఈఓ శ్రీ బొల్లవరపు జయరాజు తదితర ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# ఏనుగు కొండపై పర్యాటక 'కళ' పీపీపీ విధానంలో రిసార్ట్స్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్!





**తాబేలు మెట్ట ఏనుగు కొండ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పెషల్ ఫోకస్.**

**సీతానగరం, పెన్ పవర్, మార్చి28:**పురాతన రామాలయం ఉన్న రామ దుర్గం, తాబేలు మెట్ట ఏనుగు కొండ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధి పనులను ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానంలో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం సీతానగరం మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామంలో పర్యటన సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాయదుర్గం - ఏనుగు కొండ ప్రాంతం లో ప్రతిపాదించిన 7.5 ఎకరాల స్థలాన్ని ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాలుగా ప్రత్యేక గుర్తింపు పొందిన పురాతన రామాలయం ఉన్న రాయదుర్గం పర్యాటక కేంద్రం ఇక్కడే ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఏనుగు కొండ తాబేలు మెట్ట ప్రాంతంలో టూరిజం రిసార్ట్స్, రెస్టారెంట్లు వంటి యూనిట్ల స్థాపనకు అనువైన 7.5 ఎకరాల భూమిని గుర్తించినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం కోసం అవసరమైన మార్గదర్శకాలను టూరిజం వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న వెండర్లు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే పలు రాయితీలు, విద్యుత్ టారిఫ్ సబ్సిడీలు, జీఎస్టీ రాయితీలు తదితర ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ప్రాంతం పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి దృష్ట్యా ప్రత్యేక ప్రాధాన్యం కలిగినదిగా పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండటంతో పాటు, రాబోయే గోదావరి పుష్కరాల నేపథ్యంలో వసతి సదుపాయాల కోసం ఇది ఉత్తమ కేంద్రంగా మారుతుందని తెలిపారు.

పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని, ఆసక్తి గల పెట్టుబడిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. ఎంపీయుపి పాఠశాల సందర్శన పాఠశాలల్లో విద్య ప్రమాణాలు బోధన పద్ధతులు మౌలిక సదుపాయాల మధ్యాహ్నం భోజనం పథకాలు అమలు తదితర అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛమైన ఆరోగ్యమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగ్య స్వామి అవసరమని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీలు పారేశుద్ధ్యం పై నిర్లక్ష్యం వైఖరి పై ఆస్పత్రి మరియు పరిసరాల్లో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం కనిపించడంపై కలెక్టర్అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యనికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు ఎన్వీ వి.వి. ఎస్. మూర్తి, జిల్లా టూరిజం అధికారి పి. వెంకట చలం, జిల్లా పాఠశాలవిద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావు, తహసీల్దార్ అంకం శ్రీనివాస్ , ఎస్సై బి . వినయ్ ప్రతాప్ , తదితరులు పాల్గొన్నారు.

# అని గేరు లో 'స్వర్ణాంధ్రబి స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించిన, అడ్డతీగల ఎంపీడీవో కుమార్..





**అడ్డతీగల ,పెన్ పవర్ మార్చ్28:** అడ్డతీగల మండలం అనిగేరు గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమం శనివారం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్తను తగ్గించడం, పునర్వినియోగం మరియు రీసైక్లింగ్ ద్వారా భూమిని రక్షించడం, ప్లాస్టిక్ నిరాకరించడం, కాగితపు సంచులు మరియు గుడ్డ సంచులు వాడటం, ఇంటిలో తడిచెత్త కంపోస్ట్ చెయ్యడం, వ్యర్థాలు ఉత్పన్నం అయ్యే దగ్గర వేరు చేయడం, పొడి వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో హరిత రాయబారుల ద్వారా సేకరించి, గ్రామపంచాయతీ కి అందించేలా తగు చర్యలు మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిస్థాయిలో తగ్గింపు మరియు పర్యావరణహిత చర్యలను, పారిశుధ్య అవగాహనా కార్యక్రమాలను, శుభ్రతా కార్యక్రమాలను నిర్వహించవలసినదిగా గ్రామ ప్రజలకు ఎంపీడీవో వివరించారు. అనంతరం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రక్త క్యాన్సర్ పై అపోహలు వీడాలి



- ఎముక మజ్జ మార్పిడి తో రక్త క్యాన్సర్ ను నివారణ సాధ్యం
- డా. కరుణ కుమార్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** రక్త క్యాన్సర్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించా ల్సిన అవసరం ఉందని యశోద హాస్పిటల్స్ - సికింద్రాబాద్ యూనిట్ ప్రముఖ హేమటాలజిస్ట్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా. కరుణ కుమార్ శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. సరైన సమయంలో పరీక్షలు చేసి చికిత్స పొందితే చాలా మంది రోగులు పూర్తిగా కోలుకునే అవకాశ ముందన్నారు. రక్త క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ఎంతో కీలకమని, లక్షణాలు సాధారణ అనారోగ్యంగా భావించి నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ఉందన్నారు. తరచుగా జ్వరం రావడం, అలసట, బలహీనత, ఇన్ఫెక్షన్లు పునరావృతం కావడం, బరువు తగ్గడం, శరీరంలో గడ్డలు పెరగడం, రక్తస్రావం, నీలి మచ్చలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే హెమటాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై ప్రజల భయాలు అనవసరమన్నారు. ఇది శస్త్రచికిత్స కాదని, రక్త మార్పిడి విధానంలో జరిగే ప్రక్రియని తెలిపారు. సరైన రోగి ఎంపిక, తగిన డోనర్, అనుభవ జ్ఞులైన వైద్య బృందం ఉంటే మంచి ఫలితాలు సాధించ వచ్చున్నారు.

ప్రజల్లో రక్త క్యాన్సర్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై అవగాహన పెరగాలని, నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. ఉభయగోదావరి ప్రజలకు తాను ప్రతీ నెలా నాలుగో గురువారం రాజమండ్రిలో గల యశోద మెడికల్ సెంటర్ లో అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఎక్సిక్యూటివ్ రాఘవ చైతన్య తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ఎల్‌పిజి సరఫరా నిరంతరం




**– జేసి మేఘా స్వరూప్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:**తూర్పు గోదావరి జిల్లాలో గృహ అవసరాలు, అత్యవసర సేవలకు అవసరమైన ఎల్‌పిజి సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని కలెక్టర్ (పౌ.స) వై. మేఘా స్వరూప్ శనివారం తెలియ చేశారు. సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ పంపిణీదారులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నా మన్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు సుమారు 12,000 నుండి 12,500 వరకు గ్యాస్ సిలిండర్లు 52 పంపిణీదారుల ద్వారా సరఫరా జరుగుతుందని వై. మేఘా స్వరూప్ తెలిపారు. గ్యాస్ పంపిణీదారుల వద్ద సుమారు 14,362 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటీవల బుకింగ్స్ సుమారు 90శాతం పెరగడంతో సిలిండర్ల డెలివరీలు మొదటి రాక మొదటి డెలివరీ విధానంలో కొనసాగు తుండటంతో కొంత జాప్యఎం జరుగుతుందన్నారు. పెండింగ్ బుకింగ్స్ త్వరలోనే క్లియర్ చేస్తామని వై. మేఘా స్వరూప్ తెలిపారు.గ్యాస్ సిలిండర్లు వినియోగదారుల ఇళ్లకే సరఫరా చేస్తున్నామని గోడౌన్లకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును 70శాతం వరకు పెంచినందున వాటి సరఫరా కూడా సజావుగా కొనసాగుతుందన్నారు.

వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం, నిల్వ చేయడం నివారించి అవసరానికి మాత్రమే సిలిండర్లు బుక్ చేసుకోవాలని కోరారు. వినియోగదారులు ఐ వి ఆర్ ఎస్,వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యూపీఐ యాప్స్ సులభంగా బుకింగ్స్ చేసుకోవచ్చని సూచించారు.గత కొద్ది రోజుల్లో 47 కేసులు నమోదు చేసి 119 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు వై. మేఘా స్వరూప్ తెలిపారు. గ్యాస్ హోర్డింగ్, నల్లబజారు, అధిక ధరలకు అమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌పిజికి ప్రత్యామ్నాయంగా గోదావరి గ్యాస్ పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ సరఫరా కోసం మునిసిపల్ కార్పొరేషన్, కొవ్వూరు మునిసిపాలిటీ, చాగల్లు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

సుమారు 19,800 కనెక్షన్లకు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. గృహా, వాణిజ్య వినియోగదారులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. జిల్లాలోని 208 పెట్రోల్ బంకుల ద్వారా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని వై. మేఘా స్వరూప్ తెలిపారు.

# నూతన ఎస్సై గా బి. వినయ్ ప్రతాప్ బాధ్యతలు స్వీకరణ



**సీతానగరం, పెన్ పవర్, మార్చి 28:**మండల కేంద్రమైన సీతానగరం ఎస్సై రామ్ కుమార్ బదిలీపై వెళ్లడంతో నూతన ఎస్సై గా బి. వినయ్ ప్రతాప్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కాకినాడ సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన గత ఎస్సై రామ్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ తన ప్రథమ ప్రాధాన్యమని గతంలో జిల్లాలోని పనిచేసిన అనుభవం తనకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని లా అండ్ ఆర్డర్ పై ప్రత్యేకంగా నిఘ ఉంచడం జరుగుతుందని, చోరీల నియంత్రణకు, జూదం, పేకాట, కోడి పందాలు తదితరాల నియంత్రణపై నాటు సారా తయారీ, అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిబ్బంది సమావేశంలో ఆయన పోలీస్ స్టేషన్లో సిబ్బంది తనకు చేదోడు వాదోడుగా ఉండి సహకరించాలని ఆయన కోరారు.

# 16వ వార్డు లో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 28**: 16వ వార్డులో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా, స్థానిక బీజేపీ నాయకులు అడపా వరప్రసాద్ సహకారం తో మున్సిపల్ కమిషనర్ వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వార్డులోని డ్రైనేజీ, పారిశుధ్యం , ఇతర మౌలిక వసతుల లేమిని కమిషనర్ కి ప్రత్యక్షంగా వివరించారు. ఈ పర్యటనలో

డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, స్థానికులు పడుతున్న ఇబ్బందులను వరప్రసాద్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డులా మారుతోందని, దోమల ఉధృతి పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫాగింగ్ చేయించాలని కోరారు. వార్డులోని పార్కును అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. అడపా వరప్రసాద్ చూపించిన ప్రతి సమస్యను పరిశీలించిన కమిషనర్ , తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# యువకుడికి క్లిష్టమైన రిస్క్ రీడో బెంటాల్ గుండె శస్త్రచికిత్స



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి 29:**నగర పరిసర కూనవరం గ్రామానికి చెందిన పాతికేళ్ల యువకుడికి అత్యంత క్లిష్టమైన రిస్క్ రీడో బెంటాల్ గుండె శస్త్రచికిత్సను యశోద హాస్పిటల్స్- సికింద్రాబాద్ యూనిట్ లో విజయవంతంగా నిర్వహించామని శనివారం మీడియా సమావేశంలో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డా. సుధీర్ వల్లూరి వివరించారు. ఈ యువకుడు మొదటి సారి గుండె శస్త్రచికిత్స చేయించుకున్నడని ఆఒర్టిక్ రూట్, వాల్వ్ సమస్యలతో ఆసుపత్రికి చేరాడన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రీడో బెంటాల్ సర్జరీ అవసరమైందన్నారు. ఇటువంటి శస్త్రచికిత్సలు అధిక రక్తస్రావం వంటి కారణాలతో ప్రమాదకరంగా ఉంటాయని డాక్టర్ సుధీర్ తెలిపారు.

డాక్టర్ సుధీర్, ఇతర నిపుణుల బృందం సమగ్ర ప్రణాళికతో 14 గంటల పైగా శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని, రోగి పూర్తిగా కోలుకుని సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రీడో బెంటాల్ శస్త్రచికిత్సలు సవాలుతో కూడుకున్నవని, ప్రణాళిక, నైపుణ్యం, బృంద సమన్వయం ఉంటే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు.

యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సల్లో ప్రత్యేక నైపుణ్యం, ఉన్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో కార్డియాక్ వైద్య సేవలు అందించేందుకు ప్రతి నెల వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్డియాక్ సర్జరీ ఓపిడీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి శనివారం జంగారెడ్డిగూడెం, రెండవ శనివారం తణుకు, నాలుగో శనివారం రాజమండ్రిలో ఓపిడీలు నిర్వహించనున్నామని ఉభయగోదావరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశం లో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఎక్సిక్యూటివ్ రాఘవ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి శిక్షణ కార్యక్రమం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 28;** మండలంలో ప్రా శిక్షణ కార్యక్రమాన్ని ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించబడును అని బిజెపి సీనియర్ నాయకులు చాత్రాతి ప్రసాద్ తెలిపారు. శనివారం జీలుగుమిల్లిలో చాత్రాతి ప్రసాదు ఇంటి వద్ద బిజెపి మండల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం నిర్వహించుకోవడానికి మండల కమిటీ తీర్మానించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రా శిక్షణ కార్యక్రమం ఇన్చార్జి కొప్పాక శ్రీనివాసరావు, బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొండపల్లి ప్రసాదు, బిజెపి మండల వైస్ ప్రెసిడెంట్ భీమిరెడ్డి సత్య వరప్రసాద్ రెడ్డి, మండల కార్యదర్శి పుల్లగుం సుబ్బారెడ్డి, వీరంకి బాలు, గడ్డం రామకృష్ణ, ఊక సూరి చంద్రం, మండల సోషల్ మీడియా సభ్యులు కక్కిరాల మురళీధర్, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, సోమిరెడ్డి ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు మెరుగైన వసతి కల్పన కు కృషి

* ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 29:** అనాథ పిల్లలకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో చర్యలు చేపట్టామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌కెఆర్ మహిళ కళాశాల ఎదురుగా రూ. 78 లక్షలతో చేపట్టనున్న సదనం చిల్డ్రన్ హోమ్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సదనం చిల్డ్రన్ హోమ్‌లో అనాథ పిల్లలు నివసిస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ ద్వారా రూ.78 లక్షల నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. జీ ప్లస్ వన్ విధానంలో నిర్మించనున్నట్లు, చిల్డ్రన్ హోమ్ సామర్థ్యం పెరిగి మరింత మంది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించవచ్చునన్నారు. భవనంలో పిల్లల వసతి, చదువు, గదులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఆయన పిల్లలతో కొద్ది సేపు ముచ్చట్టించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, సదనం చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పై కేసు నమోదు

* రశీదు ఇవ్వటానికి నిరాకరించిన ప్రకాష్ నగర్ సిఐ తో వైసిపి నేతలు వాగ్వాదం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** దళితుల పైన, దళిత సంఘాల గురించి ఆడియోలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అభ్యంతర కరంగా మాట్లాడిన విధానంపై విచారణ జరిపించాలని స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్లో శనివారం వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదుకు సంబంధించి రసీదు ఇవ్వడానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ బాజీలాల్ నిరాకరించడం పై వైసీపీ నేతలకు, ఆయనకు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక ఆడియోలో అప్పారావు ఎస్సీ వర్గాల పట్ల కించపరుస్తూ మాట్లాడిన తీరు దారుణంగా ఉందన్నారు.
ఆదిరెడ్డి అప్పారావు ఆడియోలను నేషనల్ ఫోరెన్సిక్ లాబరేటరీ పంపించాలని, విచారణ చేసి నిజానిజాలు నిర్ధారించాలని,
లేదంటే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని భరత్ తెలిపారు.
సీఐతో గంటసేపు వాగ్వాదం చేస్తే అకనాలెడ్జిమెంట్ కాఫీ ఇచ్చార న్నారు. ఈ కార్యక్రమంలో భరత్ తో పాటు యస్ సి విభాగం అధ్యక్షులు తిరగాటి దుర్గారావు, రాష్ట్ర యస్ సి విభాగం అధికార ప్రతినిధి కాటం రజనీకాంత్, మార్తి నాగేశ్వరరావు, దాసీ వెంకటరావు, గారా చంటి, అల్లు జయరాజ్, సుందర్ సింగ్, శివ, విజయ్, పులి సాగర్, చిన్నా, కొవ్వడ కృష్ణ, దొమ్మేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ ఎస్.దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలి




**ఏలూరు, మార్చి 28 పెన్ పవర్ :** ఎల్ ఆర్ ఎస్ పథకంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర టౌన్ మరియు కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ డా. మక్బూల్ అహ్మద్ నగరపాలక సంస్థ సిబ్బందిని ఆదేశించారు. ఏలూరు నగరపాలక సంస్థ ఓల్డ్ కౌన్సిల్ హాలు నందు శనివారం ఎల్ ఆర్ ఎస్ పథకంలో అందిన దరఖాస్తుల పరిష్కారాలపై డైరెక్టర్ అఫ్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కమీషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా డా. మక్బుల్ అహ్మద్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్ పథకంలో అందిన దరఖాస్తులలో నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు.ఎల్ ఆర్.ఎస్. అప్లికేషన్లకు సంబంధించి ప్లానింగ్ సెక్రెటరీస్ కు మరియు ఎల్ టి పి లకు, టౌన్ ప్లానింగ్ విభాగం వారికి దానిపై అవగాహన కల్పించారు. సమావేశం జరుగుతుండగానే ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్ కొన్ని అప్లికేషన్స్ ను ప్రాసెస్ చేయించి సంబంధిత యజమానులకు ఎల్.ఆర్.ఎస్ ప్రొసీడింగ్ లను నేరుగా కమీషనర్ అందజేశారు.సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, రాష్ట్ర టౌన్ మరియు కంట్రీ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్,కే రాజ్యలక్ష్మి అసిస్టెంట్ డైరెక్టర్, జననీ టిపిఏ మరియు రీజినల్ ఆఫీస్, రాజమహేంద్రవరం నుండి జి. సుబ్బారావు ,రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ మరియు ఆర్. వి .కోటేశ్వరరావు హాజరు అయ్యి, ఎల్ టి.పి. లకు మరియు ప్లానింగ్ సెక్రెటరీస్ కు, టౌన్ ప్లానింగ్ విభాగం వారికి దిశానిర్దేశం చేసియున్నారు.

## ఆదిత్య ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల ర్యాలీ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లలు శనివారం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.ఎన్.రెహమాన్ స్వచ్ఛభారత్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో భాగంగా చేయి చేయి కలుపుదాం స్వచ్ఛ రాజమండ్రి నిలుపుదాం, ప్లాస్టిక్ సంచుల వినియోగం -పర్యావరణానికి హానికరం, మన చెత్త మన బాధ్యత-పరిశుభ్రతే మన సాధ్యత, చెత్తను విడదీద్దాం -పర్యావరణాన్ని కాపాడుదాం వంటి నినాదాలు చేశారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల నుండి రామాలయం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. రామాలయం సెంటర్ వద్ద వాలంటీర్లు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ తీగల రాజా, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ బొర్రా రాజు , సూపర్వైజర్ ఎమ్.తులసీదాస్, సచివాలయం సానిటేషన్ సెక్రటరీ లు సేవా ఎస్. కె.షెహనాజ్ విప్పర్తి వెంకట రమణ , తో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జి.వి. ఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బి హెచ్.వి.రమాదేవి పోలుకొండ సాయి బేబి విమల, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.కిరణ్ కుమార్ తో పాటు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ల పర్యవేక్షకులు జాహ్నవి,సమీర,స్వీటీ, సౌమ్య పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆశ్రమ పాఠశాల, మహిళా జైల్ ను సందర్శించిన రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** బొమ్మూరు ఆశ్రమ పాఠశాల, మహిళా జైల్ సందర్శన
స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనడం
మహిళా ప్రత్యేక, సెంట్రల్ జైళ్లలో ఖైదీలతో పరస్పర చర్చలు
జిల్లాలో గిరిజన సంక్షేమం, స్వచ్ఛత ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్ష లో భాగంగా శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు బొమ్మూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా ప్రత్యేక జైలు, సెంట్రల్ జైలు సందర్శించి ఖైదీలతో చర్చలు జరిపి వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు కె. మల్లేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. జైళ్లలో ఖైదీలతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యురాలు కె. లక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా జైలులో ఖైదీల పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి




పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి, వసతి గృహాల సిబ్బంది, జైళ్లు అధికారులు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వీర్లంకపల్లి శ్రీ రామాలయానికి టిటిడి నిధులు

శ్రీవాణి ట్రస్ట్ చెక్కును అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ మార్చి 28 :-** గోకవరం మండలం వీర్లంకపల్లి గ్రామంలో ఉన్నటువంటి పురాతన శ్రీ రామాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ రూ 9,95,601/లు చెక్కును ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు.హిందూ ధర్మ పరిరక్షణకు శక్తి వంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. హిందూ ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషిని అందిస్తానని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా వీర్లంకపల్లి శ్రీ రామాలయానికి నిధులు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీర్లంకపల్లి వెలుగు స్కూల్ చైర్మన్ సుంకరరాజు, భావన పోసేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నోటి శుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించండి.






**డెంటల్ వైద్యులు డా.కె. మధు**

**గోకవరం పెన్ పవర్ మార్చి 28 :-** దంతముల గురించి ఆరోగ్య అవగాహన మరియు నోటి శుభ్రత గురించి అందరికీ అవగాహన కల్పించాని దంతములను ఏవిధము శుభ్రపరచు కోవాలనే అంశం మీద టెక్నిక్స్ తెలిపారు దంత వైద్యుడు డాక్టర్ కే మధు.గోకవరం మండలం కొత్తపల్లి నందు జి. కొత్తపల్లి పి. హెచ్. సి లో గోకవరం సి. హెచ్. సి డెంటల్ వైద్యులు డా.కె. మధు ఆధ్వర్యంలో " ఓరల్ హెల్త్ "కార్యక్రమం లో భాగంగా వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. మధు మరియు కొత్తపల్లి పి. హెచ్. సి వైద్యురాలు డా. నిఖిత సిబ్బంది కి మార్చి 20 నుండి ఏప్రిల్ 20వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయి కనుక స్కూల్స్ నందు మరియు వైద్య శిభిరాలలో అందరికీ దంతముల గురించి ఆరోగ్య అవగాహన మరియు నోటి శుభ్రత గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు.డా.మధు దంతము లను ఏవిధము శుభ్రపరచు కోవాలనే అంశం మీద టెక్నీక్స్ తెలిపారు. వివిధ దంత వ్యాధులు తీసుకో వలసిన జాగ్రత్తలు మరియు ఈ కార్యక్రమాలును ప్రజలలోకి తీసుకెళ్ళాలని ఏ హ్యాపీ మౌత్ ఈస్ ఏ హ్యాపీ లైఫ్ అనేనినాదంతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం ఏప్రిల్ నెల 20వ తేదీ వరకు జరుగు తాయని మండలం లో గల స్కూల్స్ లో వివిధ అవేర్ నెస్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమం లో హెచ్. వి. రాజేశ్వరి, ఏం. ఎన్. ఎమ్ లు, ఎమ్. ఎల్. హెచ్. పి. లు, మరియు ఎం.పీ. హెచ్. ఏ లు శ్రీనివాస్, పవన్, ఆచారి, ఆశాలు పాల్గొన్నారు.

## కూనవరం పడవ రేవు వివాదం



* పడవ పాట దారుడి నుండి 40 లక్షలు వసూలు చేయని పంచాయతీ అధికారు
* కూనవరం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

**కూనవరం,పెన్ పవర్,మార్చి 28.** కూనవరం మండలంలోని రుద్రంకోట పడవ రేవు నిర్వహణ ఇప్పుడు తీవ్ర వివాదస్పదంగా మారింది.గత కొంతకాలంగా పేరుకుపోయిన బకాయిలు,అధికారుల నిర్లక్ష్యం నేపథ్యంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఏడాదికి సంబంధించి సుమారు14 లక్షలు పాత బాకీ ఇంకా అలాగే ఉంది.2015, 2026సంవత్సరానికి సంబంధించి 26లక్షలకు పైగా బకాయిలు పేరుకుపోవడం గమనార్హం.కొత్తగా వేలం (పాట)వేసే సమయం దగ్గరపడుతున్నా,పాత బకాయిలను వసూలు చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.ప్రతి నెలా వసూలు చేయాల్సిన రుసుమును ఎందుకు వసువులు చేయలేదని,ఈ వ్యవహారంలో అధికారులకు ముడుపులు అందుతున్నాయా అని శ్రీనివాసరావు అనుమానం వ్యక్తం చేశారు.బకాయిల వసూలు కోసం నేడు అధికారులు చేసిన హడావుడి వల్ల సామాన్య ప్రజలు బలి అవుతున్నారని ఆవేదన చెందారు.పడవ నిర్వాహకులు మొండిగా వ్యవహరించి, పడవను నిలిపివేశారు. దీనివల్ల నదికి అటువైపు భార్యాపిల్లలుఇటువైపు ద్విచక్ర వాహనాలతో భర్తలు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు.శ్రీనివాసరావు అధికారులను ఉద్దేశించి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని,పడవ ప్రయాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదని, తక్షణమే పడవ నడపాలని హెచ్చరించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే,సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని అధికారులను హెచ్చరించారు.ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని వదిలేస్తూ,సామాన్య ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని అన్నారు.

# విద్యార్థులకు మానవతా విలువలను ఉపదేశించిన పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి

## ఆదర్శ కాలేజ్ లో ఆచార్య నాగార్జున పేరిట మెషిన్ రూమ్ ప్రారంభించిన స్వామిజీ.





**గోకవరం పెన్ పవర్ మార్చి 28:--** మానవుడు మరియు మానవత విలువలపై ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ జి కొత్తపల్లి విద్యార్థులకు పరమ పూజ శ్రీ శ్రీ శివ స్వామి ఉద్బోదించారు. శనివారం మండలంలోని జి కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కాలేజీలో కళా చాలా చైర్మన్ పి కనకరాజు కార్యదర్శి కరస్పాండెంట్ పి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థులు మానవత విలువలపై ఉద్బోధించారు. ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నేడు పిల్-12 మరియు సెట్-27 కార్యక్రమాల ప్రారంభోత్సవం మరియు పవర్ టాక్ అత్యంత వైభవంగా నిర్వహించారు. గౌరవ అతిథిగా తడవర్తి రాంబాబు పాల్గొన్నారు. ముందుగా కళాశాల విద్యార్థులు అధ్యాయకపాక బృందం స్వామీజీకి స్వాగత ఏర్పాట్లు ఘనంగా చేశారు. పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి వారు కళాశాల ఆవరణకు విచ్చేసిన వేళ వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణ కుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. సందర్భంగా కళాశాల ఆవరణ భక్తిభావంతో నిండిపోయింది. పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి వారి పవిత్ర హస్తాల చేత రెండవ శతాబ్ద వ్యక్తి అయినటువంటి శ్రీ ఆచార్య నాగార్జున పేరిట కళాశాలలో మెషిన్ రూమ్ ప్రారంభించారు. భారతదేశం యొక్క గొప్ప సంప్రదాయం మరియు ధర్మం గురించి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మాటలు చెప్పారు.నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని,వారు నైతికంగా,వృత్తిపరంగా శ్రేష్ఠంగా ఎదగాలని ఆశీర్వదించారు ఫార్మసీ శాస్త్రానికి ఆద్యుడైన ఆచార్య నాగార్జున పేరిట మెషిన్ రూమ్‌ను అంకితం చేస్తూ విద్యార్థులకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు పేర్కొన్నారు. సెమినార్ హాల్‌లో విద్యార్థిని విద్యార్థులు మరియు అధ్యాపక బృందం అందరూ సమావేశమయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. త్రినాధ రావు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని శుభారంభం చేశారు. అనంతరం గణపతి అథర్వశీర్షం పఠించి విఘ్నాలను దూరం చేసుకున్నారు.స్వాగత ప్రసంగంలో ప్రిన్సిపాల్ డాక్టర్. త్రినాధ రావు పిల్లలు పి ఐ ఎల్ ఎల్ ప్రోగ్రామ్ జనవరి 9, 2025న ప్రారంభమైందని, విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధన మరియు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే దీని లక్ష్యమని వివరించారు. సెట్ ప్రోగ్రామ్ విద్యార్థులలో నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని తెలిపారు.స్వామీజీ ప్రసంగంసభలో అందరినీ ఆధ్యాత్మిక చైతన్యంతో నింపింది. కార్యక్రమం లో కోఆర్డినేటర్ శ్రీను , డైరెక్టర్ ఎ సంతోష్ శివకుమార్ , ట్రెజరర్ ఎ జె ఎల్ ప్రవల్లిక, డైరెక్టర్ ఈ కె నరసింహ రావు (సంతోష్) జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె హారిక ముగింపులో కోఆర్డినేటర్ శ్రీనివాస్ ధన్యవాద ప్రసంగం చేస్తూ విచ్చేసిన గౌరవ అతిథులకు, సంస్థ నిర్వహణ వర్గానికి, అధ్యాపకులకు, సిబ్బందికి మరియు విద్యార్థులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం జై హింద్, వందే మాతరం నినాదాలతో విజయవంతంగా ముగిసింది.

## టిడిపి ఆవిర్భావ వేడుకకు అందరూ ఆహ్వానితులే-జగదీశ్వరి



**పోలవరం,పెన్ పవర్ మార్చ్ 28** :మండలంలోని చేగుండపల్లి గ్రామంలో ఉన్న తమ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం టిడిపి ఆవిర్భావ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికారిక సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి,టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ నాయక్ దంపతులు తెలిపారు.పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేగుండపల్లిలోని తమ పార్టీ కార్యాలయంలో ఉదయం నిర్వహించనున్నామన్నారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు సమక్షంలో పార్టీ జెండా ఎగురవేయడం కేక్ కట్ చేయడం మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ జగదీశ్వరి విజయ్ లు తెలిపారు.ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.అలాగే పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలోనూ తెలుగుదేశం జెండా ఎగురువేయాలని వారు సూచించారు.

## ఆదివాసులను దూసించిన ప్రభుత్వ విఫ్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి...

- ఎమ్మెల్యే తో సీఎం చంద్రబాబు నాయుడు ఆదివాసీ సమాజానికి క్షేమాపణ చెప్పించాలి
- టీడీపీ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి.....
- ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుంజా డిమాండ్




**కూనవరం,పెన్ పవర్,మార్చి 28.**ప్రభుత్వ విప్ ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందళం అశోక్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ అండ్ క్రిమినల్ కేసులు పెట్టాలని, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుంజా పత్రిక ముఖంగా డిమాండ్ చేసారు.ఒరిశా నుండి ఆంధ్ర ప్రాంతానికి వలస వచ్చి ఎస్టీ బెంతు ఒరియాలుగా చలామణి అవుతూ,తమ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న విషయాన్నీ చెప్పుకుందామని, శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే,ప్రభుత్వ విఫ్ బెందళం అశోక్ వద్దకు వెళ్ళిన ఆదివాసీ నాయకులను ఆఫ్ నాలెడ్జ్ పెలోస్, బ్లేడి బాస్టేట్స్ అంటూ అవమానకరంగా బూతులుతిట్టదమేమిటని,వెంటనే అతనిని ప్రభుత్వ విఫ్ పదవీ నుండి తొలగించి, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ రోజు కూడా ఆదివాసుల పట్ల అగౌరవంగా మాట్లాడలేదని, టిడిపి ప్రభుత్వంలో ఇలా కులాలను దూషిస్తూ మాట్లాడే వారికి స్థానం ఇవ్వరని ఆదివాసీ సమాజం కోరుకుంటుందని,బెశారత్తుగా ఏమ్మెల్యే అశోక్ తో ఆదివాసీ సమాజానికి క్షేమపన చెప్పించి అతనిని పార్టీ నుంచి తొలగించి పదవి నుంచి సస్పెండ్ చెయ్యాలని అనిల్ అన్నారు.

వాస్తవానికి ఎమ్మెల్యే వెనకేసుకొస్తున్న వారు ఎస్టీ బెంతో ఒరియాలు కారని, ఒరిశా నుండి ఆంధ్ర ప్రాంతానికి వలస వచ్చిన బిసి-ఎ (వడ్డి) కులానికి చెంది వారన్నారు.వీరు ఆంధ్రలో ఎస్టీ బెంతో ఒరియలుగా చలామణి కావడానికి చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే చాలా మంది ఎస్టీ బెంతో ఒరియాలుగా నకిలీ సర్టిఫికెట్స్ తో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.వీరిని ఎస్టీ జాబితాలో తీసుకు రావడానికి ఇటివలే అసెంబ్లీ డిప్యూటి స్పీకెర్ రఘురామకృష్ణం రాజుని కలిసి,ఎస్టీ బెంతో ఒరియాలుగా గుర్తించాలని ప్రభుత్వ విఫ్ బెందేలం అశోక్ కోరరారు.ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి,ఇతర ఆదివాసి సంఘాల ప్రతినిదులు ఎమ్మెల్యేను కలిసి తమ అభ్యంతరాలు వేవనేత్తారు.తన వద్ద సరియైన సమాదానం లేక, సహనం కోల్పోయి కొపోద్రిక్తుడై ఎమ్మెల్యే బూతులు తిడుతూ రెచ్చిపొయరు.ఇది ప్రజా ప్రతినిధి లక్షణం కాదని, తక్షణమే ప్రభుత్వ విప్ పదవి నుండి పోలగించాలని కోరారు.

నకిలీ బెంతో ఒరియాల విషయంలో టిసిఆర్&టిఐ, రెవెన్యూ శాఖలు జరిపిన విచారనలలో కూడా వీరు ఎస్టీ బెంతో ఒరియాలు కరని, ఒరిశా నుండి ఆంధ్ర ప్రాంతానికి వలస వచ్చిన బిసి-ఎ (వడ్డి) కులానికి చెంది వారని గుర్తించిందని, ప్రభుత్వ విఫ్ బెందేలం అశోక్ తన రాజకీయ అధికారాన్ని ఉపయోగించి 27 వేల మంది నాన్ ట్రైబల్స్ ని అక్రమంగా ఎఎస్టీలలో కలపాలని చూస్తున్నారని ఆదివాసీ జెఎసి బృందం మండిపడింది. ఎమ్మెల్యే బెందళం అశోక్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ & క్రిమినల్ కేసులు పెట్టాలని, ప్రభుత్వం కేసు నమోదు, చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## వీరమహిళలు సేవా స్ఫూర్తి బాధిత కుటుంబానికి అండగా జనసేన నాయకులు



**చింతూరు పెన్ పవర్ మర్చి 28:**చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఎడమ ఉషారాణి కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ నిన్న మరణించడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండటంతో దహన కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రంపచోడవరం నియోజకవర్గ జనసేన వీరమహిళలు ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. దహన ఖర్చుల నిమిత్తం మొత్తం రూ.3000 సహాయం అందజేశారు. అందులో తీగల కవిత గారు రూ.2000, బి. విశాలక్షి గారు రూ.500, రమణి గారు రూ.500 చొప్పున సహాయం చేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని జనసేన పార్టీ నాయకులు తీగల రవి (ఉపాధ్యక్షులు), కారం దుర్గరావు (ప్రధాన కార్యదర్శి), దోమల భగత్ (సంయుక్త కార్యదర్శి), అలాగే వీరమహిళ తీగల కవిత కలిసి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒకరికొకరు తోడుగా నిలవడం సమాజపు బాధ్యత. చిన్న సహాయం అయినా ఒక కుటుంబానికి ఎంతో ఊరటనిస్తుంది అని పేర్కొన్నారు. దాతృత్వంతో ముందుకొచ్చిన వీరమహిళలను స్థానికులు అభినందించారు. జనసేన మండల కమిటీ నాయకులు కూడా స్పందిస్తూ, అవసరమైనప్పుడు ప్రజలకు అండగా నిలబడటంలో ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ ఘటన మరింతమంది దాతలు ముందుకు వచ్చి అవసరమైన వారికి సహాయం చేయాలని ప్రేరణనిస్తుంది.

## రాజకీయం కంటే అభివృద్ధి ముఖ్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి.



- జనసేనలో చేరిన నందమూరు గ్రామ వైసిపి కార్యకర్తలు.

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 28:** రాజకీయం చేయడం కంటే తాడేపల్లిగూడెం నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయటమే తనకు ముఖ్యమని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో శుక్రవారం, తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం, నందమూరు గ్రామ వైసిపి కార్యకర్తలు, సీనియర్ పొలిటికల్ నాయకులు తోట గోపి సారధ్యంలో, దూల సూర్యనారాయణ తో పాటుగా వారి అనుచరులు 25కుటుంబాలకు చెందినవారు జనసేన లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజలకు సేవ చేయాలని అన్నారు. జనసేన లో చేరితే రాజకీయంగా ప్రమోషన్ వచ్చినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అడిగే స్థితినుంచి ప్రజలకు సేవ చేసే స్థాయికి వచ్చే అవకాశం జనసేనలో ఉంటుందని అన్నారు. ప్రధాని మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ల సారధ్యం లో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకు వెళుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి పవన్ కట్టుబడి ఉన్నారని అన్నారు. అధికారం కోసం కాకుండా సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో జనసేనలోకి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడప ప్రసాద్ జనసేన నాయకులు పాల్గొన్నారు.

## వ్యాపారంలో రాణించాలంటే పారదర్శకత, నైతిక విలువలు ఎంతో ముఖ్యం



**వరంగల్ ఎన్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటకృష్ణ**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 28.**వ్యాపారంలో రాణించాలంటే పారదర్శకత, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని వరంగల్ ఎన్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటకృష్ణ సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ఆధ్వర్యంలో "స్టార్ట్-అప్ లీగల్ & ఎథికల్ స్టెప్స్" అనే అంశంపై నిపుణుల ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రాంగణంలోని పండిట్ మదన్ మోహన్ మాలవ్య అకడమిక్ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) చైర్మన్, ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయ శర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి ఆచార్యులు, డాక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల, అంకితభావంతో పాటు వినియోగదారులను ఆకట్టుకునే సత్తువా ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని తెలిపారు. స్టార్ట్-అప్స్ ప్రారంభ దశలో తీసుకోవాల్సిన ముఖ్యమైన నిర్ణయాలు, సరైన వ్యాపార నిర్మాణాన్ని ఎంచుకోవడం, కంపెనీ రిజిస్ట్రేషన్ విధానాలు, మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యత వంటి అంశాల గురించి తెలియజేశారు. వ్యాపారంలో నైతిక విలువలు ఎంత ముఖ్యమో వివరిస్తూ పారదర్శకత, నమ్మకం, బాధ్యతతో వ్యవహరించడం ద్వారా స్టార్ట్-అప్స్ దీర్ఘకాలంలో విజయవంతం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, స్టార్ట్-అప్ ఇండియా వంటి కార్యక్రమాలు ద్వారా యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. చట్టపరమైన సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవడం ద్వారా వ్యాపారంలో వచ్చే ప్రమాదాలను తగ్గించుకోవచ్చని వివరించారు. డీన్లు డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణా దృక్పథాన్ని పెంపొందించదానికి ఇటువంటి నిపుణుల ప్రసంగాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) చైర్మన్, ఆచార్యులు, డాక్టర్ కార్తికేయ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో విజయవంతమైన స్టార్ట్-అప్స్ స్థాపించేందుకు ఈ కార్యక్రమం మార్గనిర్దేశం చేస్తుందని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటకృష్ణను నిట్ ఆచార్యులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొని, స్టార్ట్-అప్‌లకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన పొందటం విశేషం.

## 28,29 తేదీల్లో బిజెపి పట్టణ ప్రశిక్షణా కార్యక్రమం

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 28.**28,29 తేదీల్లో బిజెపి పట్టణ ప్రశిక్షణా కార్యక్రమం భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీలలో దీన్ దయాళ్ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం తాడేపల్లిగూడెం పట్టణ సమీపంలోని చినతాడేపల్లి వివాన గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించడం జరుగుతుంది. గూడెం పట్టణ పరిధిలోని రాష్ట్ర, జిల్లా బిజెపి నాయకులు, శక్తికేంద్రాల బాధ్యులు, బూత్ కమిటీ లుబాధ్యులు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి. అని ప్రశిక్షణ కు హాజరయ్యే వారు 28.03.2026 తేదీ శనివారం సాయంత్రం 3.30గం.లకు హాజయ్యి తమపేర్లను నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు సాయంత్రం 4.00గంటలకు ప్రారంభకార్యక్రమం. ఆనంతరం రెండు కాలంశాలు ఉంటాయి. ఆనంతరం రాత్రి 8.30 గం కు రాత్రి భోజనం తదుపరి సంస్కృతిక కార్యమాలు ఉంటాయి. రాత్రి 10.00గంలకు రాత్రి విశ్రాంతి. వేదిక :వివాన గార్డెన్స్ డాక్టర్ జి ఆర్. రెడ్డి గారి ఫంక్షన్ హాలు చిన్నతాడేపల్లి రోడ్డు, తాడేపల్లిగూడెం.సూచన :రాత్రి బస కోసం దుప్పటి, ఒక జత దుస్తులు, బ్రష్, పేస్ట్, ఉదయం యోగకు అనువైన దుస్తులు వెంట తెచ్చుకోవాలి అని పట్టణం అధ్యక్షులు దూలం శ్రీను వెల్లడించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ఉద్యాన విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, రైతులకు ప్రయోజనకరమైన వసతులను పూర్తిస్థాయిలో వినియోగించాలి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 28.** అంటుకట్టు పద్దతి ద్వారా సురక్షిత వాతావరణంలలో, మట్టిరహిత పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన కూరగాయ మొక్కల నారు, రైతుకు అధిక ఉత్పత్తిని అందించడమే కాక చాలా తక్కువగా వ్యాధుల బారిన పడుతుందని, నేల నుండి సంక్రమించే వివిధ రకాల వ్యాధుల నుండి తెగుళ్ల నుండి నారు దశలో రక్షింపబడుతుంది కనుక నాణ్యమైన ఉత్పత్తి జరుగుతుంది. రైతులందరూ ఈ సురక్షిత పద్ధతిలో కూరగాయ మొక్కల నారు ఉద్యాన విశ్వవిద్యాలయం విశిష్టత రక్షిత సాగు కేంద్రం నుండి నామమాత్రపు ధరతో పొందవచ్చని, ఇందుకు ముందుగా వెంకట్రామన్నగూడెం ఉద్యాన పరిశోధనా స్థానం నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని "ఉపకులపతి డా. కె. ధనుంజయరావు గారు తెలియజేశారు. అంతేకాక


ఉద్యాన విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, రైతులకు ప్రయోజనకరమైన వసతులను పూర్తిస్థాయిలో వారి కొరకు వినియోగించాలని సంబంధిత అధికారులను, శాస్త్రవేత్తలను ఉపకులపతి ఆదేశించారు.

ఈ రోజు కప్పలకుంట గ్రామానికి చెందిన కూరగాయ రైతులు, తాము ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న ప్రకారం సిద్ధపరచిన వంగ నారు, ఉపకులపతి డా. కె. ధనుంజయరావు గారి చేతుల మీదుగా రైతులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డా. జి. రామానందం గారు, ఉద్యాన పరిశోధనా స్థానం హెడ్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డా. టి. సుశీల గారు మరియు శాస్త్రవేత్త డా. యన్. వి. గౌతమ్ దీక్షితులు రైతులు, ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయ వంగడాల కంటే గ్రాఫ్టెడ్ వంగడాల వాడకం వల్ల దిగుబడులు పెరిగినట్లు రైతులు హర్షం వ్యక్తం చేసారు.

అంటు కట్టిన కూరగాయల మొక్కల నారు కొరకు సంప్రదించవలసిన నెం. 7382633654.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు....







**అడ్డతీగల,పెన్ పవర్, మార్చ్ 28:** శనివారం రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామ సమీపంలో ఉన్న మిర్యాల వీధి సమీపంలో రాత్రి 9 గంటల సమయములో పోతంశెట్టి. మురళీమోహన్ రెడ్డి అనే వ్యక్తి బైక్ పై వెళుతుండగా, ప్రమాదవశాస్తు రోడ్డుపై పడిపోవడంతో, తలకు బలమైన గాయాలు జరిగాయి. నోటి నుండి రక్తం తీవ్రంగా రావడంతో గ్రామస్తులు 108 సమాచారం ఇవ్వగా 108 వాహనంలో అడ్డతీగల ప్రభుత్వాసుపత్రి తీసుకురావడం జరిగింది . ఈయన జడ్డంగి ఐసిడిఎస్ సూపర్వైజర్ భర్తగా గుర్తించడం జరిగింది. సమాచారాన్ని పోలీసు వారికి ఆ ఆ గ్రామస్తులు తెలపడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీస్ వర్గాలు తెలిపాయని సమాచారం. ప్రస్తుతం అడ్డతీగల కమ్యూనిటీ హాల్ సెంటర్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

## ఉత్తమ సేవలకు దక్కిన అరుదైన గౌరవం




**గోకవరం పెన్ పవర్ మార్చి 28 :--** గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్ పోలీస్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ తను చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా పోలీస్ బాస్ సత్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ లోని జిల్లాలో పలువురు ఉత్తమ సేవల అందించిన వారికి అవార్డు రివార్డులు ప్రధాన ఉత్సవం జరిగింది దీనిలో భాగంగా గోకవరం మండలం నుండి ఉత్తమ సేవలందించిన స్పెషల్ బ్రాంచ్ కి చెందిన శ్రీనివాస్ కి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఐపిఎస్ చేతుల మీదుగా నగదు రివార్డు అందుకున్నారు గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ పలు నేర ప్రవర్తన కంట్రోల్లో గోకవరం ఎస్సై నాగ పవన్ కుమార్ ఆధ్వర్యంలో చేసిన పలు సేవలకు గుర్తింపుగా ఈ గుర్తింపు దక్కినట్లు పలు పోలీస్ శాఖ అభిమానులు తెలిపారు ఇంతటి గౌరవం దక్కినందుకు గోకవరం ఎస్సై లు నాగ పవన్ కుమార్ మరియు మరో ఎస్సై నాగమణి లు సహసర పోలీస్ సిబ్బందికీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎంపీపీ ప్రభకు అరుదైన అవకాశం



**గంగవరం, పెన్ పవర్, మార్చి 28:** గంగవరం మండలానికి చెందిన గిరిజన మహిళ, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభకు అరుదైన గౌరవం దక్కింది. రేపు మంగళగిరిలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమెకు ప్రత్యేక స్థానం కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వేదికను అలంకరించే అవకాశాన్ని పార్టీ ఆమెకు కల్పించడం విశేషంగా నిలిచింది. ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తోపాటు 19 మంది మాత్రమే ఉండే సభా వేదికపై డాక్టర్ తీగల ప్రభ కు అవకాశం కల్పిస్తూ మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం నుండి శనివారం రాత్రి ఆహ్వానం అందింది .గత 22 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ, గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన తీగల ప్రభ సేవలను పార్టీ ఉన్నత నాయకత్వం గుర్తించింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో ఆమె పాత్ర ప్రశంసనీయమని పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ అరుదైన అవకాశంపై తీగల ప్రభ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత కృషి చేసి పార్టీ అభివృద్ధికి తోడ్పడతానని ఆమె పేర్కొన్నారు.




## గ్రామాల అభివృద్ధిలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సహకరించాలి.

-మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ తోట రవి.





**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 28:** గ్రామాల అభివృద్ధిలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సహకరించాలని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయపు సమావేశపు హాల్లోఎంపిడిఓ బావిశెట్టి హరికృష్ణ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి తోట రవి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని సమావేశంలో వివరించారు. ఈ సందర్బంగా గోనేడ ఎంపిటిసి, మండల ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ, శృంగారయుని పాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, రామచంద్రాపురం ఎంపిటిసి బండారు ప్రసాద్ పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిస్కారంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఎంపీపీ తోట రవి కలుగజేసుకొని మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకువచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం ఎంపిపి తోట రవిని, మండలంలోని సర్పంచ్ లు ఎంపిటిసిలు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ, వైస్ ఎంపిపి లు బొడ్డేటి గణపతి, పాఠంశెట్టి సత్యవతి, పంచాయతీరాజ్ డిజి, వై ఉమాశంకర్, ఏపీవో నాయుడు, వెలుగు ఏపీఎం,శరకణం వేదకుమారి, ఎంఈఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు, కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి రాంబాబు నాయక్ , ఆర్ ఐ, సత్యదేవి,పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు గోకేడ రాజా,సాదే కుమారి,సర్పంచ్ లు వీరంరెడ్డి కాశీబాబు,తోట అయ్యన్న జ్యోతుల రాంబాబు, గుడాల శ్రీలతరాంబాబు,పట్టు చంటిబాబు,జ్యోతుల సీతామహాలక్ష్మి,మందేటి వీరలక్ష్మి,మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం.



**372 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు.**

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 28;** మండల కేంద్రమైన ఆలమూరులో మల్లూరి పాపయ్య టౌన్ హాల్ నందు కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ డైరెక్టర్ బూసి విద్యాసాగర్ నిర్వహణలో ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్, అడ్వకేట్ ఆలమూరు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్యా ప్రసన్న వెర్రియ్య దంపతులు శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. రాజమహేంద్రవరం శ్రీకర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం,రమా దంత వైద్యశాల, డెర్మాగ్లో చర్మవ్యాధుల ఆస్పత్రి సిబ్బంది పాల్గొని బి.పి,షుగర్, గుండె,కంటి,దంత,చర్మానికి సంబంధించిన వైద్య పరిక్షలు నిర్వహించి వైద్య సేవలను అందజేశారు. సుమారు 372 మంది రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోగా వైద్యులు ఉచితముగా శస్త్రచికిత్సలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు వైద్య సేవలు అందించిన బూసి విద్యాసాగర్ ను, మండల నాయకులు,గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వంటిపల్లి సతీష్,ఈదల నల్ల బాబు, కేతా రాంబాబు, మానేపల్లి శ్రీనివాస్, బొబ్బా రాంబాబు, సాలి సత్యనారాయణ, నెల్లి చిన్న, బూసి చిట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు నైతిక విలువలు అవసరం





**శివ స్వామీజీ**

**ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా పిల్ 12, సెట్ ప్రారంభం**

**స్టాఫ్ రిపోర్టర్ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 28:** విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి వారు పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, వారు నైతికంగా మరియు వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. శనివారం గోకవరం మండలం కొత్తపల్లి లోగల ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ లయన్ పి.కనకరాజు అధ్యక్షతన జరిగిన పిల్ 12 సెట్ 27 ఆచార్య నాగార్జున మిషన్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరమ పూజ్య శ్రీ శ్రీ శివ స్వామీజీ తాడపత్రి రాంబాబు హాజరయ్యారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శివ స్వామి ఆచార్య నాగార్జున పేరిట ఏర్పాటు చేసిన మెషిన్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. త్రినాధరావు మాట్లాడుతూ, ఫార్మసీ శాస్త్రానికి ఆద్యుడైన ఆచార్య నాగార్జున పేరిట ఈ కేంద్రం ఏర్పాటు చేయడం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ త్రినాధ రావు ద్వీప ప్రజ్వలన చేసి శ్రీ గణపతి అథర్వశీర్ష పఠనంతో ప్రారంభించారు. స్వాగత ప్రసంగంలో పిల్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని, సెట్ కార్యక్రమం ద్వారా నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందిస్తున్నామని వివరించారు. గౌరవ అతిథి తడవర్తి రాంబాబు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో నైతికత, నైపుణ్యాలు రెండూ అవసరమని సూచించారు. పవర్ టాక్‌లో ఫార్మసీ రంగంలో ఉన్న కెరీర్ అవకాశాలు, పరిశోధన మార్గాలు, వ్యవస్థాపకతపై విద్యార్థులకు మార్గదర్శనం అందించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పరమ పూజ్యశ్రీ శివ స్వామీజీ ,తడపర్తి రాంబాబు లను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాగమణి

డైరెక్టర్ లు ఏ సంతోష్ శివకుమార్ కోశాధికారి ప్రవళిక, డైరెక్టర్ ఇంజి. కె. నరసింహరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె. హారిక, కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ సుజిని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం నగర పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన ఎన్ వి వి సత్యనారాయణ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 28:** ఏలేశ్వరం నగర్ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా ఎన్ వి వి సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏలేశ్వరం నగర పంచాయతీ పాలకుల ఐదేళ్ల గడు ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈయన హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (పూర్తి అదనపు బాధ్యతలు) గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం నగర పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

# ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్.. కేకేఆర్‌తో మ్యాచ్‌కి స్టార్ ప్లేయర్స్ ఔట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభంలోనే ముంబై ఇండియన్స్ జట్టుకి బిగ్ షాక్ తగిలింది. రేపు (2026, మార్చి 29న) కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న తొలి పోరుకి ముందు ముగ్గురు కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. వాంఖెడేలో సీజన్‌ను ఘనంగా ప్రారంభించాలనుకుంటున్న ముంబైకి, ఈ కీలక ఆటగాళ్ల గైర్హాజరీ పెను సవాల్ గా మారింది. బౌలింగ్ అండ్ బ్యాటింగ్ విభాగాల్లో మార్పులు చేసి కేకేఆర్ జట్టును ముంబై ఇండియన్స్ టీమ్ ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.మిచెల్ సాంట్నర్: న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్, ఇటీవలే దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్ ముగిసిన తర్వాత అతను ఇంకా జట్టుతో చేరాల్సి ఉంది. మిడిల్ ఓవర్లలో పరుగులు కంట్రోల్ ఇవ్వడంలో అతను కీలక పాత్ర పోషించనున్నాడు. కాగా టీ20 వరల్డ్ కప్‌లో 8 మ్యాచ్‌ల్లో 140 స్ట్రైక్ రేట్‌తో 120 పరుగులు చేయడమే కాకుండా, బంతితోనూ మెప్పించాడు.విల్ జాక్స్: వ్యక్తిగత కారణాల వల్ల ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ అందుబాటుపై లేదని తెలుస్తుంది. టీ20 వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ జట్టులో అతను కీలక పాత్ర పోషించాడు. ఇక టీ20 వరల్డ్ కప్ లో ఇంగ్లాండ్ తరపున అద్భుతంగా ఆడి, 9 వికెట్లు తీయడమే కాకుండా 4 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకున్నాడు.జస్ప్రీత్ బుమ్రా: వాంఖెడే స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు బుమ్రా కూడా హాజరుకాకపోవడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో అతడు రేపటి కేకేఆర్ తో జరిగే మ్యాచ్ ఆడేది అనుమానంగా మారింది.

**ప్రత్యామ్నాయ ప్లేయర్స్ ఎవరు?:**

అల్లా ఘజన్ఫర్: సాంట్నర్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఈ యువ స్పిన్నర్‌ను ఆడించే అవకాశం ఉంది. సాంట్నర్ లాగే ఇతను కూడా బంతితో బ్యాటర్లను నియంత్రణ చేస్తాడు.

షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ : విల్ జాక్స్ స్థానంలో పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ రూథర్‌ఫోర్డ్‌ను లోయర్ మిడిల్ ఆర్డర్‌లో ఉపయోగించుకోవచ్చు. ఇతను గతంలో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడాడు.

# ఫస్ట్ మ్యాచ్‌లోనే ఆ హిస్టరీపై కన్నేసిన కోహ్లీ.. జస్ట్ 6,6,6,6,6,6,6,6,6 కొడితే చాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026కు రంగం సిద్ధమైంది. తొలి మ్యాచ్ లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఈ క్రమంలో ప్రస్తుతం అందరి చూపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపైనే పడింది. ఈ మ్యాచ్ లో కోహ్లీ ఓ అద్భుతమైన రికార్డ్ సృష్టించే అవకాశం క్లియర్ గా కనిపిస్తుంది. దీంతో విండీస్ దిగ్గజం క్రిస్ గేల్, భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మల సరసన చేరేందుకు కింగ్ సన్నాహాలు రచిస్తున్నాడు.



ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ చరిత్రలోనే మరో అద్భుత రికార్డును సృష్టించేందుకు రెడీ అవుతున్నాడు. ఐపీఎల్ లో 300 సిక్సర్ల మార్కును చేరుకునేందుకి విరాట్ మరో 9 సిక్సర్లు మాత్రమే కొట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు ఆడిన 267 మ్యాచ్‌లలో కోహ్లీ మొత్తం 291 సిక్సులు కొట్టాడు. ఒకవేళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లోనే అతడు ఈ ఘనత సాధిస్తే, ఐపీఎల్‌లో 300 సిక్సర్లు కొట్టిన థర్డ్ బ్యాటర్‌గా చరిత్రలోకి ఎక్కుతాడు.

ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్స్ లిస్టులో వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ తొలిస్థానంలో ఉన్నారు. గేల్ కేవలం 142 మ్యాచ్‌లలోనే 357 సిక్సులు కొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇక టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2025 సీజన్‌లోనే ఈ 300 సిక్సర్ల మైలురాయిని అందుకున్నాడు. రోహిత్ ప్రస్తుతం 272 మ్యాచ్‌లలో 302 సిక్సర్లతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. ఇప్పుడు వీరిద్దరి సరసన చేరే ఛాన్స్ విరాట్ కోహ్లీకి ఉంది. ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్ బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగబోతుంది. కోహ్లీకి ఇది సొంత మైదానం కావడంతో.. ఈ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం, దీంతో కోహ్లీ బ్యాట్ నుంచి పరుగుల వరద పారే ఛాన్స్ కనిపిస్తుంది. ఇప్పటికే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక రన్స్ చేసిన ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. అతడు 39.54 సగటుతో మొత్తం 8661 రన్స్ సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 63 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కాగా 2026 మెగా వేలానికి ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కోహ్లీని రూ. 21 కోట్లకు రిటైన్ చేసుకుంది. గత సీజన్లలో అద్భుత ప్రదర్శన చేసిన విరాట్, ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని ఆర్సీబీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈరోజు జరగబోయే కీలక పోరులో కోహ్లీ 300 సిక్సర్ల మార్కును అందుకుంటాడో లేదో చూడాలి.

# మధ్య హోరాహోరీ పోరు.. టాస్ టైమింగ్, మ్యాచ్ ప్రిడిక్షన్ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్ ఈరోజు ఘనంగా ప్రారంభం కాబోతుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. గత సీజన్‌లో తొలిసారి టైటిల్ గెలిచిన ఆర్సీబీ ఈసారి వరుసగా రెండో టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయిన సన్‌రైజర్స్ ఈసారి బలంగా పునరాగమనం చేయాలని చూస్తోంది.

**ఆర్సీబీ బలాలు:**

రజత్ పాటిదార్ నాయకత్వంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలోకి దిగబోతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు జట్టులోని కీలక ఆటగాళ్లు గాయాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పేస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్, నువాన్ తుషార తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేరు. అలాగే యశ్ దయాల్ మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో బౌలింగ్ బాధ్యతలు భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్, రసిక్ సలామ్ మోయనున్నారు. బ్యాటింగ్ విభాగంలో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, టిమ్ డేవిడ్ లాంటి ఆటగాళ్లు కీలకం కానున్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జితేష్ శర్మ నిర్వహించనున్నాడు. అలాగే రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా వంటి ఆల్‌రౌండర్లు చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం కలిగి ఉన్నారు.

**సన్‌రైజర్స్ బలాలు:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే.. జట్టు ప్రధాన ఆటగాడు ప్యాట్ కమిన్స్ తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో ఇషాన్ కిషన్ తాత్కాలిక నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. బ్యాటింగ్‌లో

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హైన్రిచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లు టాప్ ఆర్డర్‌ను బలంగా నిలబెడతారు. మిడిల్ లో నితీష్ కుమార్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్ లాంటి ప్లేయర్స్ జట్టుకు అదనపు బలంగా మారనున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, బ్రైడన్ కార్స్ ఉన్నప్పటికీ, ప్యాట్ కమిన్స్ లేకపోవడం జట్టు కొంత బలహీనంగా కనిపిస్తుంది.

**ఈ మ్యాచ్ సాయంత్రం 7: 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. టాస్ సాయంత్రం 7 గంటలకి పడనుంది.**

**ఈ మ్యాచ్ ఎక్కడ జరుగుతుంది?:**

ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ మధ్య మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతుంది.

**ఎవరు గెలుస్తారు?:**

బెంగళూరులో ఎస్ఆర్‌హెచ్‌పై గెలవడానికి ఆర్‌సీబీ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హోమ్ గ్రౌండ్ ప్రయోజనం, బలమైన బ్యాటింగ్ లైనప్, ప్రస్తుత ఛాంపియన్‌గా ఉన్న ఆత్మవిశ్వాసం కారణంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే, SRH బ్యాటింగ్ లైనప్ గనుక క్లిక్ అయితే చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద పారడం ఖాయం.

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898-ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**




**వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్నిర్వచించింది**

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898-ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది. ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.

**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!



**త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచించింది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965